క్లుప్తంగా

భద్రతా నిబంధనలు తప్పనిసరి



వాహనాల తనిఖీల్లో పోలీసులు

వెదురుకుప్పం : రహదారి భద్రతా నిబంధనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ వెంకటసుబ్బయ్య స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని గోవిందవారిపల్లె వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రికార్డులు ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే ట్రిపుల్ రైడింగ్ చేసిన వాహనదారులకు జరిమానా విధించారు. సిబ్బంది కల్యాణ్, కృష్ణమరాజు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

గంగాధరనెల్లూరు : బీజేపీ జీడీ నెల్లూరు మండల అధ్యక్షుడిగా ఆగరమంగళం గ్రామానికి చెందిన ఆనంద్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పరిశీలకుడు యువరాజు తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక చేపట్టారు. కార్యక్రమంలో నేతలు సుధాకర్ , మణివర్మ, జీకే నాయుడు, మురళి, నారాయణమూర్తి ఆచ్చారి, సుందరాజు, అంజలి, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం : బీజేపీ వెదురుకుప్పం మండలాధ్యక్షుడిగా కొండకిందపల్లె గ్రామానికి చెందిన బోడిరెడ్డి అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రక్రియను జీకే చౌదరి, రాజేంద్ర పర్యవేక్షించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న నూతన మండల కమిటీ నేతలు

నగరి : భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను పట్టణ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి వాజ్‌పేయికి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని మండలాలకు నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. నగరి అర్బన్ అధ్యక్షుడిగా హరి, రూరల్‌కు జె.సతీష్, పుత్తూరు అర్బన్‌కు గిరి, రూరల్‌కు చెన్నకేశవులు, నింద్రకు రామ్‌ప్రసాద్, విజయపురానికి రాములును పార్టీ తరపున ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిలకం ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముని కృష్ణమ నాయుడు, నాయకులు రామ్మూర్తి, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బడాబాబుల 'పార్కింగ్'



బస్టాండ్ ముందు పార్క్ చేసిన కార్లు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద సామాన్య ప్రయాణికులకు తిరస్కారమే ఎదురవుతోంది. కనీసం ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకునేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద సుమారు 200 బైక్‌లు పార్క్ చేసేందుకు సరిపడా స్థలం ఉంది. అయినప్పటికీ అందులో కేవలం 50 వాహనాలు పట్టే ప్రాంతం మాత్రమే వదిలిపెట్టారు. మిగిలిన స్థలం చుట్టూ ఇనుప రాడ్లతో కంచె ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో బడా బాబులు తమ కార్లు నిలబెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. కనీసం వారు ఆర్టీసీ ప్రయాణికులు కూడా కాకపోవడం గమనార్హం. బస్టాండ్ చుట్టుపక్కల హోటళ్లు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకునే వారు ఈ స్థలంలో తమ కార్లు పార్క్ చేసుకుంటూ ఉంటారు. సదరు పెద్దమనుషులకు ఆర్టీసీ ఉన్నతాధికారులతో పరిచయం ఉండడమే ప్రధాన అర్హత. ఒకవేళ వారు రాకపోయినా ఆ స్థలం ఖాళీగా ఉండిపోతుందే కానీ, ఎవరూ ద్విచక్రవాహనాలు పార్క్ చేయడానికి వీలు లేదు. దీంతో ప్రయాణికులు తమ బైక్‌లను నిలబెట్టుకునేందుకు స్థలం లేక, బస్టాండ్ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేసేస్తున్నారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై ఏటీఎం డీఆర్ నాయుడును వివరణ కోరగా.. గురువారం నుంచి సామాన్య ప్రయాణికులు తమ ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకునేందుకు మొత్తం స్థలాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎవరూ ఇబ్బంది పడే పరిస్థితి ఇకపై ఉండదని వెల్లడించారు.

ఉచిత గ్యాస్ కొందరికే

- పలువురి ఖాతాలకు జమ కాని గ్యాస్ సిలిండర్ నగదు
- ఏడాదికి మూడు సిలిండర్ల హామీ తుస్
- ఆధార్, రేషన్ కార్డు లింక్ చేసి ఈకేవైసీ చేసుకున్నా కానరాని ఫలితం



నగరి కొండచుట్టు మండపం వద్ద సిలిండర్ కోసం వేచివున్న జనం

నగరి : ప్రతి ఇంటికీ ఏడాదికి 3 సిలిండర్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం.. ఈ ఏడాది ఒక్కటే సిలిండర్ ప్రకటించింది. దానికి కూడా షరతులు వర్తిస్తాయని తెగేసి చెప్పింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు గ్యాస్ సిలిండర్ భారం తగ్గిస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో పేదలకు ఒకే సిలిండర్‌కు పరిమితం చేసింది. అయితే ఆ ఒక్క సిలిండర్‌కు కూడా అందరి ఖాతాలకు డబ్బులు పడటం లేదు. దీంతో గ్యాస్ ఏజెన్సీల చుట్టూ జనం ప్రదక్షిణలు చేస్తున్నారు. మేము సిలిండర్ కొన్నా మాకు ఖాతాలకు డబ్బులు ఎందుకు పడటం లేదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను నిలదీస్తున్నారు. అర్హత జాబితాలో ఉంటేనే డబ్బులు పడతాయన్న సమాధానం ఏజెన్సీల నుంచి వినిపిస్తోంది. నియోజకవర్గంలో వివిధ ఏజెన్సీల నుంచి 51,473 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ఒక్క నగరి పట్టణంలోని వెంకటరమణ హెచ్‌పీ గ్యాస్ గ్రామీణ్ విత్రక్‌లోనే 15,358 కనెక్షన్లు ఉండగా అందులో 9,613 మాత్రమే అర్హత ఉన్న కనెక్షన్లుగా గుర్తించినట్లు సమాచారం. దీంతో పలువురు అర్హత కోల్పోయినట్లు సాక్ష్యంగా నిలుస్తోంది. దీంతో హామీలు ఇచ్చిన సమయంలో ఎలాంటి షరతులు చెప్పలేదు కదా.. గ్యాస్ కనెక్షన్ ఉన్న అందరికీ ఏడాదికి మూడు సిలిండర్లనే కదా ప్రకటించారని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అర్హత ఉన్నా డబ్బులు ఖాతాలో పడకపోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. ఇటు పౌర సరఫరాల శాఖ కానీ, అటు ఆయిల్ కంపెనీల గ్యాస్ ఏజెన్సీలు కూడా దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. ఫలితంగా నిరుపేదలకు నిరాశకు గురవుతూ ఎప్పటి మాదిరిగానే బహిరంగ మార్కెట్ ధర చెల్లించి వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత గ్యాస్ అంటూ ఆశపడిన వారికి కూటమి ప్రభుత్వం నిరాశను గిఫ్ట్‌గా ఇచ్చింది. దీంతో దీపావళి పండగను పురస్కరించుకుని అమల్లోకి తెచ్చిన ఉచిత గ్యాస్ పథకం ఆదిలోనే అటకెక్కిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నెల గడిచినా నగదు పడలేదు



నవంబరు 9వ తేదీ గ్యాస్ బుక్ చేశా, 13వ తేదీ సిలిండర్ డెలివరీ అయ్యింది. ఇప్పటి వరకు గ్యాస్ డబ్బులు జమ కాలేదు. ఏజెన్సీకి ఫోన్ చేసి అడిగితే సాకులు చెబుతున్నారు. ఇలాగే కాలం గడిపేస్తారోమో తెలియడం లేదు. ప్రభుత్వం ఇలా చేయడం సరికాదు.

– శాంతి, పాదిరికుప్పం కార్వేటినగరం మండలం

నమ్మకం పోయింది



ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు మాకు అర్హత ఉంది. సిలిండర్ బుక్ చేసి డబ్బులు కూడా చెల్లించాం. 20 రోజులు దాటినా ఇప్పటి వరకు మా ఖాతాలో నగదు జమ కాలేదు. ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ చుట్టూ తిరిగినా ఎలాంటి సమాధానం లేదు.

– యువరాజ్, జీడీనెల్లూరు

డబ్బులు ఇంకా జమ కాలేదు



నేను బుక్‌చేసి సిలిండర్ తీసుకొని సుమారు నెలరోజులు కావస్తోంది. ఇంకా సిలిండర్‌కు చెల్లించిన సొమ్ము నా ఖాతాకు జమకాలేదు. ఏజెన్సీ వారిని అడిగితే పడుతుందిలే అంటున్నారు. కానీ ఇప్పటి వరకు జమకాలేదు. గ్రామంలో కొందరికి మాత్రమే పడింది. పలువురి ఖాతాలకు డబ్బులు పడలేదు.

– మధు, ఓజీ కుప్పం, నగరి మండలం

కొన్ని రోజులవుతుంది



ఉచిత సిలిండర్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన కొన్ని రోజులకే నేను ఇంటికి సిలిండర్ కొన్నాను. ఇప్పటి వరకు ఆ డబ్బులు నా ఖాతాలో జమకాలేదు. కొందరిని అడిగితే వెంటనే పడదు కొన్ని రోజులవుతుంది అన్నారు. అయినా ఇప్పటివరకు పడలేదు. ఏజెన్సీలకు కూడా వీటిపై స్పష్టత ఉండటం లేదు.

– సంపత్‌కుమారి, వేపగుంట

ఎందుకు పడలేదో స్పష్టత ఇవ్వడం లేదు



నేను సిలిండర్ కొన్న రోజే ఏజెన్సీవారు మీకు పథకం వర్తిస్తుంది. డబ్బులు మీ ఖాతాకు పడుతాయి అన్నారు. నేను సిలిండర్ తీసుకుని నెలరోజులు దాటింది. అయితే ఖాతాలు చెక్‌చేసుకోవడం తప్ప అందులో ఇప్పటివరకు డబ్బులు పడలేదు. దీనిపై గ్యాస్ ఏజన్సీ వారు కూడా సరైన స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

– ఎం.జయమ్మ, పుత్తూరు దళితవాడ

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

నగరి : ఎన్నికల అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించనుంది. గురువారం ఉదయం ప్రారంభమయ్యే ఈ సమావేశానికి పట్టణంలోని ఏజేఎస్ కల్యాణ మండపం వేదిక కానుంది. నియోజకవర్గ పరిధిలోని వడమాలపేట, పుత్తూరు, నగరి, నింద్ర, విజయపురం మండలాల శ్రేణులతోపాటు పుత్తూరు, నగరి మున్సిపాలిటీలకు చెందిన పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆర్కేరోజా అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప పలువురు సీనియర్ నాయకులు హాజరు కానున్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్ కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

శ్రీవారి సేవలో మాజీ మంత్రి రోజా



శ్రీవారి ఆలయం వెలుపల రోజా

తిరుమల : తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి ఆర్‌కే రోజా బుధవారం సేవించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

సాహిత్యంతో సమాజ సంస్కారం



సర్వోత్తమరావును సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: సమాజాన్ని సంస్కరించేందుకు సాహిత్యమే సాధనమని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తెలిపారు. బుధవారం యూత్ హాస్టల్లో జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యంపై విద్యార్థులకు అభిరుచి కల్పించే దిశగా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. సభాధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో 64 మంది శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు రచించిన అన్నమయ్య వేంకటేశ్వర శతకాన్ని తాళ్లపాక వంశీయుడు హరినారాయణ ఆవిష్కరించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య శతక ప్రాశస్తిని వివరించారు. అనంతరం ఆచార్య సర్వోత్తమ రావు, వి.ప్రతిమ, పల్లిపట్టు నాగరాజును ఘనంగా సత్కరించారు. సంఘం నేతలు అంకమనాయుడు, యువశ్రీ మురళి, డాక్టర్ మౌని, మోహన మునిసిద్ధారెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, గొడుగు చింత గోవిందయ్య, ఏడుకొండలు, మాలేపట్టు పురుషోత్తమాచారి, రొద్ద సురేంద్ర, దేవసేన నాయుడు, సుభద్ర, సుభాషిణి, శోభ, గజేంద్రరెడ్డి, ఉషారాణి, సుకుమార్‌రెడ్డి, రవిశేఖర్, చెంచయ్య, రమేష్‌కుమార్, చెన్నకేశవులు, గుల్జార్ గౌస్ పాల్గొన్నారు.

'నాడోడి బతుకులు' ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్ : మూరిశెట్టి గోవింద్ రచించిన 'నాడోడి బతుకులు' నవలను రచయిత పలమనేరు బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. యూత్ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ మాట్లాడుతూ యానాదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి ఈ నవల దర్పణం పట్టిందని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో కూడా యానాది సామాజిక వర్గం అనాగరికులుగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత సాకం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి పాల్గొన్నారు.

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

తిరుపతి కల్చరల్ : ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా 40 మంది పేద పిల్లలకు నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ బుధవారంతో ఘనంగా ముగిసింది. ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తహసున్నీసాబేగం మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన పిల్లలకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇప్పించామన్నారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

పాలసముద్రం : మండలంలోని ఆముదాల దళితవాడలో వెంకటేశులు అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి బుధవారం గ్రామానికి వెళ్లారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్భళగన్, స్థానిక నేతలు పుత్తూరు కేశవరెడ్డి, పోలయ్య, సుబ్రమణ్యారెడ్డి, జనార్దన్, షణ్ముగరెడ్డి, వేణు, శేఖర్, రజిని, రవిరెడ్డి పాల్గొన్నారు.



వెంకటేశులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు



వెదురుకుప్పం : ఆముదాల చర్చిలో ..



నగరి: చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రోజా

నగరి : నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలను రంగురంగుల కాగితాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొత్త దుస్తులు ధరించి ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే సామూహిక ప్రార్థనలు ప్రారంభించారు. కొవ్వొత్తులు చేత పట్టి క్రీస్తు జననంపై గీతాలు ఆలపించారు. మత ప్రబోధకులు బైబిల్ సందేశం వినిపించారు. జీసస్ పుట్టిన రోజు కేకు కత్తిరించి పలువురికి పంచి పెట్టడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇళ్లవద్ద ఏర్పాటు చేసుకున్న బాలయేసు పాక, క్రిస్‌మస్ ట్రీలు ఆకర్షణగా నిలిచాయి. ఇళ్లవద్ద బాలయేసు పాకను అందంగా ముస్తాబు చేయడంలో చిన్నారులు ఆసక్తి చూపారు. క్రిస్‌మస్ ట్రీలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించగా పిల్లలు ఇష్టపడే వస్తువులను పెద్దలు గిఫ్ట్ బాక్సులుగా కట్టి క్రిస్‌మస్ ట్రీకి వేలాడదీశారు. ఈ అలంకరణలను చూడటానికి పలువురు ఉత్సాహం చూపారు. చర్చిల వద్ద యేసు జీవిత చరిత్ర తెలిపే విధంగా ఏర్పాటు చేసిన అమరికలు పలువురిని ఆకర్షించాయి. శాంటాక్లాజ్ సందడి కనిపించింది. తరలివచ్చిన భక్తులతో చర్చిలు కిక్కిరిసిపోయాయి. యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

అంబేడ్కర్ విగ్రహం వద్ద క్రిస్మస్ వేడుకలు

పట్టణ పరిధి బస్టాండు ప్రాంగణంలోని బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సుమారు 100 మందితో క్రైస్తవ బోధకులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పవర్ పి రామచంద్రన్, బీఎస్పీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి వై.నాగూర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ బాబు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో మాజీ మంత్రి రోజా

పట్టణ పరిధి నాగలాపురం రోడ్‌లో గల సీఎస్ఐ చర్చిలో నగరి దళితవాడ క్రైస్తవ సోదరులు, పాస్టర్స్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. చర్చి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు సంధ్యారాణి, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, మురుగ, మహిళా నాయకులు శశికళ, వరలక్ష్మి, తేన్‌మొళి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

విజయపురం : లోక రక్షకుడు ఏసు ప్రభువు ప్రేమ సందేశాన్ని తీసుకొచ్చాడంటూ చర్చిల్లో మత పెద్దలు బోధనలు చేశారు. విజయపురం, వడమాలపేట మండలాల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలన్నీ క్రైస్తవులతో నిండిపోయాయి. రోజంతా ఆరాధనలు, ప్రార్థనలతో పరవశించిపోయారు. మత ప్రబోధకులు విశ్వాసులకు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. కరుణ, ప్రేమ, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి ఏసుక్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని ప్రబోధించారు. క్రీస్తు జన్మ విశేషాలతో క్రైస్తవులు పునీతులయ్యారు. అనంతరం కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనుసరణీయం.. క్రీస్తు మార్గం

కార్వేటినగరం : ప్రపంచ శాంతికి క్రీస్తు మార్గం అనుసరణీయమని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ తెలిపారు. బుధవారం క్రిస్మస్ వేడుకల సందర్భంగా గుండు గురుస్వామి వీధిలోని ప్రిన్సెస్ చర్చిలో ఎంపీపీ లతాబాలాజీ అందించిన 40 కేజీల భారీ కేక్‌ను పాస్టర్ ఆధ్వర్యంలో కట్ చేశారు. అలాగే బీసీకాలనీలోని బేతేల్‌షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ అందించిన 30 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు హరిబాబు, బాబు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం, దేవరగుడిపల్లె, తెల్లగుండ్లపల్లె, నెమళగుంట, దర్మాచెరువు, నల్లవెంగనల్లె గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. నల్లవెంగనపల్లెలో సర్పంచ్ పుష్ప నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివాజి, రామయ్య, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, డీఎస్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జాకబ్, విక్కీ కేక్ కట్ చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ఏసుక్రీస్తును మన కుటుంబంలోకి ఆహ్వానించినప్పుడే నిజమైన క్రిస్మస్ అని శ్రీకావేరి రాజుపురం చర్చి పాస్టర్ పాల్‌రాజ్, ఆముదాల చర్చి పాస్టర్ పాల్‌వెంకటేష్ తెలిపారు. ఆమేరకు ఆయా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జీడీనెల్లూరులో..

గంగాధర్ నెల్లూరు : మండలంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిపించారు. వేల్కూరు ఇందిరానగర్ కాలనీ సభ్యులు వేల్కూరు కుట్టి , గుణశేఖర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లో ఊరేగింపుగా వెళుతూ ప్రత్యేక గీతాలు ఆలపించారు.



నగరి: నెత్తం కండ్రిగలో ఇంటివద్ద ఏర్పాటుచేసిన బాలయేసుపాక



నగరి: క్రిస్మస్ కేక్ కత్తిరిస్తున్న సంఘకాపరి



నగరి: లూథరన్ చర్చిలో ప్రార్థనలు









కార్వేటినగరం : ప్రిన్సిసెస్ చర్చిలో కేక్ కటింగ్.., బేతేల్‌షారోన్ చర్చిలో కేక్ కటింగ్,

వెదురుకుప్పం : రంగాపురం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు,

గంగాధర్ నెల్లూరు : శాంతాక్లాజ్‌తో చర్చి సభ్యులు



జీడీ నెల్లూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు





నగరి: సీఎస్ఐ ఈస్ట్ ప్రేమాలయంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు, కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



విజయపురం: చర్చిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్